సాక్షి
అనంతపురం
సోమవారం : 27 : జనవరి : 2025





టమాట కిలో రూ.14

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.11 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



దానిమ్మ చెట్లకు నిప్పు

కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర పొలంలో దానిమ్మ చెట్లు కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.8°/10.3°

జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం పెరిగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మహిళలపై అనుచిత వ్యాఖ్యలా?


- మాజీ ఎమ్మెల్సీ డొక్కా వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం
- ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ శివరామిరెడ్డి



వజ్రకరూరు: మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ రాజకీయంగా లబ్ధి పొందడానికి గృహిణుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమని ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఓ మీడియా చానల్ వేదికగా మాజీ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర మహిళలను 'ఆంధ్ర శశికళ' అంటూ కించపరచడం దారుణమన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన శశికళతో మహిళలను పోల్చారని, ఆమె చెప్పినట్లే వైఎస్సార్‌సీపీ నడుస్తోందని చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది తమిళనాడు కాదని, ఇక్కడ ఉన్నది ఆంధ్రప్రదేశ్ ప్రజలని హితవు పలికారు. రాష్ట్ర మహిళలు తెలివైన వారని, హుందాగా ఉంటారని, అలాంటి వారి గురించి దిగజారి మాట్లాడటం తగదన్నారు. సీనియర్ నాయకుడై ఉండీ ఇలా మాట్లాడటం చూస్తే మహిళల పట్ల ఆయనకు ఏ మాత్రం గౌరవం ఉందో అర్థమవుతోందన్నారు. పార్టీల పరంగా విభేదాలు సహజమని, విమర్శలు, ప్రతి విమర్శలు సంస్థాగతంగా ఉండాలి తప్ప, వాటిలోకి గృహిణులను లాగడం బాధాకరమన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలను తరచూ మారుస్తూ పదవులు సంపాదించాలని చూసే డొక్కా... వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ముదిగల్లులో మళ్లీ చిరుత సంచారం

- బెంబేలెత్తుతున్న స్థానికులు



ముదిగల్లు వద్ద కొండలో చిరుత

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో చిరుత మరోసారి సంచరించింది. ఇటీవల అటవీ శాఖ అధికారులు చిరుత కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం మరోసారి చిరుత కనిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పది రోజుల వ్యవధిలోనే రెండోసారి కనిపించిందంటూ బిక్కుబిక్కుమంటున్నారు. చిరుత నుంచి తమను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గణతంత్ర వైభవం



అనంతపురం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్



ప్రసంగిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



జిల్లా కోర్టులో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాస రెడ్డి, చిత్రంలో జిల్లా జడ్జి శ్రీనివాస్ తదితరులు

- ఘనంగా రిపబ్లిక్ డే
- జిల్లావ్యాప్తంగా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- అనంతపురం పరేడ్ గ్రౌండ్‌లో కనులపండువగా సంబరాలు
- జెండా ఆవిష్కరణ అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రసంగం
- సమగ్రాభివృద్ధే లక్ష్యమని వెల్లడి

అనంతపురం అర్బన్/కల్చరల్: మువ్వన్నెలు రెపరెపలాడాయి. 'భారత్ మాతాకీ జై' నినాదాలు మిన్నంటాయి. జాతీయ పతాకానికి ప్రతి ఒక్కరూ సగర్వంగా వందనం చేశారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం 76వ గణతంత్ర వేడుకలు వైభవంగా జరిగాయి.

ఉట్టిపడిన దేశభక్తి..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనంతపురం పోలీసు పరేడు గ్రౌండ్‌లో సందడి నెలకొంది. సాంస్కృతిక ప్రదర్శనలు కనులపండువగా సాగాయి. విద్యార్థుల ఆటపాటల్లో దేశభక్తి ఉట్టిపడింది. పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన 'రక్షక ప్రీ ప్రైమరీ పాఠశాల' చిన్నారులు సంబరాలను ఘనంగా ప్రారంభించారు. కురుగుంట, కూడేరు, బుక్కరాయసముద్రం కస్తూరిబా గాంధీ విద్యాలయాల విద్యార్థులు 'జయహో', 'దేశీకీ రంగీల', 'ఇదే మన భారతం' గీతాలకు సాంస్కృతిక ప్రదర్శన సమయంలో పరేడ్ గ్రౌండ్ మార్మోగింది. విశ్వభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు, పామిడికి చెందిన బీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి సందేశమిచ్చారు. విద్యార్థులకు అధికారులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు.

ఆకట్టుకున్న పోలీసు జాగిలాలు,,

గణతంత్ర వేడుకల్లో పోలీసు జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌కు జాగిలాలు లియో, వాగా, షైనీ, విక్కీలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికాయి. అనంతరం విన్యాసాల్లో భాగంగా మత్తుపదార్థాలు ఉంచిన బాక్సులను వెలికి తీయడం, హర్డిల్స్ జంప్, అపరిచిత వ్యక్తులు ఇచ్చే ఆహార పదార్థాలను తిరస్కరించడం, హత్యలు, దొంగతనాల సమయాల్లో చాకచక్యంగా వ్యవహరించడం తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి.

జిల్లా కోర్టు ప్రాంగణంలో..

అనంతపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కే. శ్రీనివాస రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ అనంతే లక్ష్యం..

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగుదామని కలెక్టర్ వి.వినోద్ కుమార్ జిల్లా ప్రజలు, అధికారులు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. అనంతపురం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన తన సందేశం వినిపించారు. 'స్వర్ణ అనంత' సాధనకు ఉద్యాన పంటలు, లైవ్ స్టాక్, రెన్యూవబుల్ ఎనర్జీ, పరిశ్రమలు, పర్యాటక రంగాలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామన్నారు. అరటి, మామిడి, టమాట, చీనీ, మిరప పంటలను ప్రోత్సహిస్తూ క్లస్టర్ ఏర్పాటు చేశామన్నారు. గొర్రెల పెంపకం, పాల ఉత్పత్తి, కోళ్ల పెంపకం వంటి వాటిపై దృష్టి సారించామన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ కింద సోలార్, విండ్ ప్రాజెక్టులు తీసుకొస్తామన్నారు. ఇంటింటికీ సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్ అమరుస్తామన్నారు. కూడేరు వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని, రాప్తాడు వద్ద ఎంఎస్ఎంఈ పార్కును మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా రిలీజియస్, హెరిటేజ్, ఎకో టూరిజం సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సామాజిక భద్రత కింద ప్రతి నెలా 2.84 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. స్వయం ఉపాధి పథకాల కింద బీసీ యువతకు రూ.32.90 కోట్లతో 1,728 యూనిట్లు, ఈబీసీ యువతకు రూ.3.90 కోట్లతో 225 యూనిట్లు, కాపు యువతకు రూ.11.55 కోట్లతో 344 యూనిట్లు మంజూరు చేశామన్నారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్ల స్థలం కేటాయించి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. హంద్రీ-నీవా కాలువలో 2,200 క్యూసెక్కుల నుంచి 3,450 క్యూసెక్కుల నీటి ప్రవాహం పెరిగేలా మొదటి దశలో గుంతకల్లు మండలం కసాపురం నుంచి జీడిపల్లి వరకు వెడల్పు పనులు చేపడతామన్నారు. 'పీఎం కిసాన్' పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2.79 లక్షల రైతుల ఖాతాల్లో రూ.111.41 కోట్లు జమ చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 7,189 టన్నుల ఎరువులను రైతులకు అందించామన్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, వంద శాతం డ్రిప్ వాడుతున్న జిల్లాగా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ శివ్‌నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీ అంబికా, ఎమ్మెల్యే కాలవ, మేయర్ వసీం తదితరులు



పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు జాగిలాల విన్యాసాలు





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ నేతలు

- అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పరిరక్షించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఈ క్రమంలో అంబేడ్కర్ రాజ్యాంగ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణంలో 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అంబేడ్కర్ స్ఫూర్తితో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించినట్లు తెలిపారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల ముందు అలవి గాని హామీలను ఇచ్చిన చంద్రబాబు.. అధికారం చేపట్టి 8 నెలలు అవుతున్నా పింఛన్ మినహా ఏ హామీ అమలు చేయలేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే రానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుండటం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ టాస్క్ ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గౌని నాగన్న, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, యాక్టివిటీ కార్యదర్శి గురుశేఖర్ బాబు, అనుబంధ విభాగ అధ్యక్షులు సాకే చంద్ర, బాకే హబీబుల్లా, రమేష్ బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, మహిళా విభాగం నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, మీసాల రంగన్న, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అరటి ఎగుమతులు.. లేని గొప్పలు!

- గత ప్రభుత్వ హయాంలోనే జిల్లా అరటికి అంతర్జాతీయ ఖ్యాతి
- 'హ్యాపీ బనానా' పేరుతో అరబ్ దేశాలకు ఎగుమతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల మరోసారి రవాణా
- అయినా తామే తొలిసారి ఎగుమతి చేసినట్లు డాంబికాలు
- జగన్ చర్యలతో తాజాగా 'హార్టికల్చర్ కాన్‌క్లేవ్'



అనంతపురం సమీపంలో అరటి తోట



2019 జనవరి 30న జెండా ఊపి జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతులు ప్రారంభిస్తున్న అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: 2004-2009 మధ్య కాలంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహంతో అనంతపురం జిల్లా 'ఫ్రూట్ బౌల్ ఏపీ'గా ఖ్యాతి పొందింది. ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2019-2024 మధ్యకాలంలో పండ్లతోటల రైతులను మరింత ప్రోత్సహించడంతో ఉద్యానహబ్ దిశగా అడుగులు పడ్డాయి. చీనీ, అరటి, మామిడి, దానిమ్మ, టమాట, పూలు లాంటి ఉద్యాన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ కల్పించే దిశగా ఎగుమతులకు శ్రీకారం చుట్టారు. దేశంలో మరెక్కడా లేని విధంగా జిల్లా నుంచి అరబ్ దేశాలకు అరటి ఎగుమతులకు 2019 జనవరి 30న పుట్లూరు మండలం కడవకల్లు వేదికగా నాంది పలికారు. తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి నేరుగా ముంబై పోర్టు, అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు 'హ్యాపీ బనానా' పేరుతో ఎగుమతి చేశారు.

అరటికి నిలయం..

అనంతపురం జిల్లా అరటి తోటలకు నిలయంగా మారుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12,250 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో అరటి సాగవుతోంది. నార్పల, పుట్లూరు, యల్లనూరు, బెళుగుప్ప, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, తాడిమర్రి, కనగానపల్లి మండలాల్లో ఎక్కువగానూ, రాప్తాడు, అనంతపురం, శింగనమల, ఉరవకొండ, కూడేరు, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, బత్తలపల్లి, ధర్మవరం తదితర మండలాల్లో కొంత వరకు అరటి తోటలు విస్తరించాయి. 95 శాతం గ్రాండ్-9 రకం కాగా కొంత యాలక్కీ రకం కూడా సాగు చేస్తున్నారు. జిల్లా అరటికి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ పరంగా డిమాండ్ నెలకొంది. 65 శాతం వరకు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా... తెలంగాణా, కర్ణాటక, ఏపీ ప్రాంతాల్లో మిగతాది మార్కెటింగ్ చేస్తున్నారు. నాణ్యత విషయంలో ఈక్వెడార్, పెరూ, ఫిలిప్పీన్స్, హొండూరాస్ లాంటి దేశాల సరసన నిలుస్తుండటం విశేషం.

కూటమి డప్పులు..

గతంలో ఎన్నడూ లేని విధంగా అరటికి మొదటి సారిగా ఉచిత పంటల బీమా పథకం అమలు చేసిన ఘనత కూడా వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుంది. అలా గత సర్కారు ఇచ్చిన ప్రోత్సాహకాలు, చర్యల కారణంగా అరటి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగానే ఇటీవల అరబ్ దేశాలకు అరటి ఉత్పత్తులను ఎగుమతి చేశారు. అయితే, గతం మరిచి కూటమి ప్రభుత్వంలోనే తొలిసారి అరటి ఎగుమతులు ప్రారంభించినట్లు ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం గొప్పలు చెప్పుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

అనంతపురం జిల్లాలో అరటి సాగు విస్తీర్ణం	10,250 హెక్టార్లు
అరటి సాగు చేస్తున్న రైతుల సంఖ్య	12,800 మంది
ఏటా అరటి దిగుబడులు	6.5 లక్షల మెట్రిక్ టన్నులు
శ్రీ సత్యసాయి జిల్లాలో అరటి సాగు విస్తీర్ణం	2 వేల హెక్టార్లు
అరటి సాగు చేస్తున్న రైతుల సంఖ్య	2,500 మంది
ఏటా అరటి దిగుబడులు	1.20 లక్షల మెట్రిక్ టన్నులు
ఉమ్మడి జిల్లా పరిధిలో అరటి దిగుబడులు	7.70 లక్షల మెట్రిక్ టన్నులు

31న అనంతలో హార్టికల్చర్ కాన్‌క్లేవ్..

గతంలో వైఎస్ జగన్ సర్కారు తీసుకున్న చర్యలు అరటి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నదాతలు అంటున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 31న స్థానికంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో 'అనంత హార్టికల్చర్ కాన్‌క్లేవ్' పేరుతో సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఉత్పత్తిదారులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు పాల్గొననున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాతో పాటు వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు తదితర అరటి పండించే జిల్లాల నుంచి రైతులు హాజరు కానున్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా అరటి ఉత్పత్తుల మార్కెటింగ్ చేస్తున్న దాదాపు 10 నుంచి 25 సంస్థల కంపెనీ ప్రతినిధులు హాజరై ఉత్పత్తిదారులు, ఉద్యానశాఖతో ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

30న ఏపీ అర్చక సమాఖ్య సమావేశం

అనంతపురం కల్చరల్: ఈ నెల 30న ఉదయం 11 గంటలకు అనంతపురంలోని మొదటి రోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వరాలయంలో ఏపీ అర్చక సమాఖ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు పూజారి భీమప్ప, ప్రధాన కార్యదర్శి శివశంకర శర్మ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్సు, డీడీఎస్ఎస్, మారేజీ, మెడికల్, హౌసింగ్ లోన్సు వంటి అంశాలుంటే వివరాలతో రావాలని సూచించారు.

దానిమ్మ చెట్లకు నిప్పు

కంబదూరు: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర సాగు చేసిన దానిమ్మ చెట్లు కాలిపోయాయి. తనకున్న10 ఎకరాల్లో ఆరేళ్ల క్రితం దానిమ్మ మొక్కలను నాటాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. మంటలు ఎగిసి పడడంతో 4,500 దానిమ్మ చెట్లు, డ్రిప్ ల్యాడర్ కాలిపోయి రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లింది.

వృద్ధురాలి దుర్మరణం

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలోని పామిడి పాత రైల్వేస్టేషన్ వద్ద (ఎద్దులపల్లి రోడ్డు) రైలు ఢీకొని ఓ వృద్ధురాలు (65) మృతి చెందింది. ఆదివారం సాయంత్రం పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో ఆమె తల ఛిద్రమైందని జీఆర్‌పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి క్రాస్ సమీపంలో ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. వివరాలు... గుమ్మఘట్ట నుంచి రాయదుర్గం పట్టణానికి ఏవీఆర్ ప్రైవేటు పాఠశాల బస్సులో ఏడుగురు విద్యార్థులు బయలుదేరారు. గోనబావి క్రాస్ వద్దకు చేరుకోగానే బస్సు అదుపు తప్పిబోల్తాపడింది. విద్యార్థులు గగన్‌దీప్(2వ తరగతి), మంజుల(ఎల్‌కేజీ), రిషిత (6వ తరగతి), నిశ్చిత (4వ తరగతి)కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి.. ఎంఈఓకు ఫోన్ చేసి విద్యార్థుల యోగక్షేమాలను ఆరా తీశారు.

నవజాత శిశువుపై పడిన వేడి గంజి

అనంతపురం: నగరంలోని రాణీనగర్‌కు చెందిన నవజాత శిశువుపై వేడి గంజి పడి ముఖం, కాళ్లు, చేతులు పూర్తిగా కాలిపోయాయి. వివరాలిలా.. రాణీనగర్‌కు చెందిన ముదినాబేగం ఇటీవల ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువును శుక్రవారం పొరుగింటి అమ్మాయి ఆడిస్తానని చెప్పి తీసుకెళ్లి అరగంటలోనే కాలిన గాయాలతో వెనక్కి తెచ్చి ఇచ్చింది. ఏమైందని కుటుంబ సభ్యులు అడగ్గా.. పొరపాటున వేడి గంజి పడిందని చెప్పి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఉద్దేశపూర్వకంగానే చిన్నారిపై గంజి పోశారని తల్లి ఆరోపిస్తోంది.

● ఉత్తమ సేవలకు ప్రశంస



కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు

విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సామాజిక సేవా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలను కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రదానం చేశారు. 91 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 257 మంది ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం జరిగిన వేడుకల్లో అవార్డులను కలెక్టర్ అందజేశారు.



శిరీష (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పీపీజీఆర్) | సలీంబాషా (ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా) | నరసింహారావు జిల్లా ఉద్యానవన అధికారి, అనంతపురం | రఘునాథ రెడ్డి (ఏపీ ఎంఐపీ) | ఉమామహేశ్వరి, జేడీఏ | హెచ్.ఆనంద్, డీపీఎం | అలెగ్జాండర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ (అడ్మిన్) | యుగేశ్వరీదేవి, సూపరింటెండెంట్ (కో-ఆర్డినేషన్) | డీవీ రమణమూర్తి (ఏఎస్పీ, అడ్మిన్) | ఇలియాజ్‌బాషా (అడిషనల్ ఎస్పీ, ఏఆర్) | వి. శ్రీనివాసరావు (అనంతపురం డీఎస్పీ)



వెంకటేశ్వర్లు (అనంతపురం రూరల్ డీఎస్పీ) | రవిబాబు (కళ్యాణదుర్గం డీఎస్పీ) | నీలకంఠ రెడ్డి (ఏఆర్ డీఎస్పీ) | ఎ.రాము, ఈఈ, మైనర్ ఇరిగేషన్ | వై. సునీత, ఎంవీఐ | డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్ | మహమ్మద్ ఖాసీం, మేనేజర్, హౌసింగ్ | తిరుమలదేవి, డివిజనల్ స్టాటిస్టికల్ ఆఫీసర్ | మనోహర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ | ప్రొ. హెచ్. సుదర్శనరావు, జేఎన్‌టీయూ వీసీ | డాక్టర్ జి. మమత, జేఎన్‌టీయూ ప్రొఫెసర్



సి. వెంకటేశ్వర నాయక్ (సీఐ) | హరినాథ్ (సీఐ) | క్రాంతి కుమార్ (సీఐ) | నీలకంఠేశ్వర (సీఐ) | శేఖర్ (సీఐ) | ధరణి కిషోర్ (సీఐ) | డాక్టర్ అక్తర్ సాహెబ్



గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద సందడి

ఆకట్టుకున్న శకటాలు

గణతంత్ర వేడుకల్లో వివిధ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన, పోలీస్ శునకాల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ శకటానికి ప్రథమ, అటవీ శాఖ – డ్వామా శకటానికి ద్వితీయ, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ శకటానికి తృతీయ బహుమతులు లభించాయి. అలాగే ఏపీఎస్‌పీడీసీఎల్ స్టాల్‌కు ప్రథమ, ఏపీఎంఐపీ స్టాల్‌కు ద్వితీయ, ఐసీడీఎస్ స్టాల్‌కు తృతీయ బహుమతి దక్కింది.

– అనంతపురం అర్బన్:

మొదటి బహుమతి



మొదటి బహుమతిని కైవసం చేసుకున్న వైద్య ఆరోగ్య శాఖ శకటం

రెండో బహుమతి



రెండో బహుమతి దక్కించుకున్న అటవీ, డ్వామా శకటం

మూడో బహుమతి



మూడో బహుమతి దక్కించుకున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శకటం

అవార్డులకు ఎంపికలో ఏదీ పారదర్శకత?

అనంతపురం అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉద్యోగులను ఎంపిక అవార్డులకు చేసిన విధానంపై గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి విమర్శలు వెల్లువెత్తాయి. ఎంపిక విధానాన్ని వివిధ శాఖ ఉద్యోగులు బహిరంగంగానే తప్పుపడుతుండడం గమనార్హం. మొత్తం 91 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 257 మంది ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేసినట్లు చూపించారు. వాస్తవానికి ఈ సంఖ్య 278కు చేరుకోవడం విశేషం. ఒక్క రెవెన్యూ శాఖ పరిధిలోనే సంఖ్యాపరంగా 63 మందిని చూపి చివరకు 82 మందికి ఇచ్చారు. ఇది పక్కా టోల్‌టిక్కిరి వ్యవహారమంటూ ఉద్యోగులు బాహాటంగానే విమర్శించారు. కలెక్టరేట్‌కు సంబంధించి 15 మంది ఉద్యోగులు, కలెక్టర్ క్యాంపు కార్యాలయం, జేసీ క్యాంపు కార్యాలయంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న 36 మందిని ఎంపిక చేశారు. అయితే జాబితాలో 17 మందినే చూపించారు.

మావి విశిష్ట సేవలు కాదా?

అవార్డులకు మొత్తం 91 శాఖల్లోని ఉద్యోగులను ఎంపిక చేయగా... వీరిలో రెవెన్యూ పరిధిలోని తొమ్మిది విభాగాల వారు, పోలీసు శాఖకు సంబంధించి 103 మంది ఉన్నారు. మిగిలిన 81 శాఖల్లో శాఖకు ఒకరిద్దరు, ముగ్గురు చొప్పున 154 మంది ఉన్నారు. ఇక్కడే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టర్, జేసీ క్యాంపు కార్యాలయంలో పని చేసే తోటమాలీలు, డ్రైవర్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌లకు అవార్డులు ఇవ్వడం పెద్ద ఎత్తున విమర్శలకు తావిచ్చింది. పరిమిత సేవలు అందించే వారివే విశిష్ట సేవలైతే ప్రజలకు – ప్రభుత్వానికి మధ్య తాము అందిస్తున్న సేవలు విశిష్ట సేవలు కాదా? అంటూ ఇతర శాఖల ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

నర్సులపై చిన్నచూపు

- అవార్డులకు ఎంపిక చేయని వైనం

అనంతపురం మెడికల్: ప్రాణాలకు తెగించి రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్న నర్సులపై జిల్లా అధికార యంత్రాంగం చిన్నచూపు చూసింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 360 మంది స్టాఫ్‌నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో 44 మంది హెడ్ నర్సులు, 102 మంది రెగ్యులర్ స్టాఫ్‌నర్సులు, 48 మంది కాంట్రాక్ట్ 1 నర్సులు, 132 మంది కాంట్రాక్ట్ 2 స్టాఫ్‌నర్సులున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏ ఒక్కరినీ అవార్డులకు ఎంపిక చేయకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజూ 3వేల నుంచి 4వేల మంది ప్రత్యక్షంగా వైద్యం పొందుతుంటారు. పసికందులు మొదలుకుని గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, క్షతగాత్రులు, తదితరులు వేల సంఖ్యలో వైద్యం పొందుతుంటారు. రోగులకందించే సేవల్లో వైద్యులది 30 శాతం పాత్ర అయితే..70 శాతం పాత్ర స్టాఫ్‌నర్సులదే కావడం విశేషం. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సులు ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించారు. వీరి సేవలను గుర్తిస్తూ అప్పటి ప్రభుత్వం వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేసి సత్కరించింది. తాజాగా గణతంత్ర అవార్డులకు స్టాఫ్ నర్సులను దూరంగా పెట్టడం దుమారం రేపుతోంది.

వివాహిత బలవన్మరణం



మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు



విజయ (ఫైల్)

పెద్దవడుగూరు: మండలంలోని మల్లేనిపల్లికి చెందిన వివాహిత విజయ (35) ఆత్మహత్య చేసుకుంది. భర్త, కుమారుడితో కలసి కొంత కాలంగా పెద్దవడుగూరులో నివాసముంటున్న ఆమె... తన సొంతూరిలో ఉన్న భూమిలో పత్తి సాగు చేపట్టారు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి పొలం వద్దకు వెళ్లిన ఆమె.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బహిర్భూమికంటూ భర్తకు తెలిపి వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో భర్త గాలిస్తూ వెళ్లాడు. పొలం మధ్యలో విగతజీవిగా పడి ఉన్న భార్యను గమనించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లోని రైతులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆమె పక్కనే ఖాళీగా పడి ఉన్న డబ్బాను గమనించి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆంజనేయులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విజయ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా...

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



జింకల రామాంజనేయులు కుటుంబసభ్యులతో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానని రాప్తాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసానిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారంటూ మదిగుబ్బ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జింకల రామాంజనేయులును ఇటీవల పోలీసులు విడుదల చేశారు. విషయం తెలుసుకున్న ప్రకాష్‌రెడ్డి ఆదివారం మదిగుబ్బ గ్రామానికి చేరుకుని జింకల రామాంజనేయులు, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమన్నారు. ఉద్దేశ పూర్వకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వలంటరీ విభాగం అధ్యక్షుడు ఓబుగారి హరినాథ్‌రెడ్డి, సర్పంచ్ నరసింహులు, వీరాంజినేయులు, యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, రామగిరి మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

- అనుమానాస్పద మృతిగా రైల్వే పోలీసుల కేసు నమోదు
- ఇది హత్యేనంటున్న బాధిత కుటుంబ సభ్యులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు



ఉమామహేశ్వరరెడ్డి (ఫైల్)

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలోని తాటిచెర్ల రైల్వే గేట్ వద్ద ఆదివారం ఉదయం ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడిని సమాచారం అందుకున్న జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన తిమ్మిరెడ్డి ఉమామహేశ్వరరెడ్డి(24)గా నిర్ధారించారు. రైల్వే ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...శనివారం రాత్రి ఈ ఘటన జరిగి ఉండవచ్చునని, అయితే ఆదివారం ఉదయం కనుగొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి తిమ్మిరెడ్డి మల్లిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, ఆస్తి వివాదాల కారణంగా తన కుమారుడిని తోపుదుర్తికి చెందిన కొందరు హతమార్చి ఉంటారనే అనుమానాలను ఫిర్యాదులో మల్లిరెడ్డి పేర్కొన్నారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంతటి పిరికివాడు కాదని, ఇది కచ్చితంగా హత్యేనని అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పార్టీ కోసం పనిచేస్తే అక్రమ కేసులా?

- కనంపల్లిలో టీడీపీ కార్యకర్త ప్రసాద్ అరెస్ట్
- గార్లదిన్నె పీఎస్ ఎదుట బాధిత కుటుంబసభ్యుల ఆందోళన



ప్రసాద్‌ను జీపులో ఎక్కిస్తున్న పోలీసులు

గార్లదిన్నె: ఏళ్ల తరబడి పార్టీ కోసం శ్రమించిన తనను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఆమె తల్లి బండారు లీలావతి కక్ష సాధింపు చర్యలతో వేధిస్తున్నారంటూ గార్లదిన్నె మండలం కనంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం కనంపల్లిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తనపై ఎమ్మెల్యే, ఆమె తల్లి వేధింపులకు పాల్పడుతున్న తీరును వివరిస్తున్న ప్రసాద్‌ను గార్లదిన్నె ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా అడ్డుకుని, బలవంతంగా జీపులో ఎక్కించుకుని పోయారు. తనను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో చెప్పాలంటూ ప్రసాద్ అడిగినా సమాధానం ఇవ్వకుండా దబాయించారు. 'నీపై రేప్ కేస్ ఉంది. అరెస్ట్ వారెంట్ కూడా ఉంది. జీపు ఎక్కు' అంటూ లాక్కెళుతుండగా ప్రసాద్ కుటుంబసభ్యులు పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. వెంటనే ప్రసాద్ కుటుంబసభ్యులు గార్లదిన్నె పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు అడిగినందుకు వరుసకు చెల్లితోనే అక్రమంగా రేప్ కేసును ఎమ్మెల్యే తల్లి బండారు లీలావతి బనాయించిందని మండిపడ్డారు. తనకు, తన కుటుంబసభ్యులకు ఏదైనా జరిగితే దానికి ఎమ్మెల్యేతో పాటు ఆమె తల్లినే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

● అమరవీరుల కుటుంబాలతో 'ఎట్ హోం'



అమరవీరుల సైనిక కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం: గణతంత్ర దినోత్సవంలో భాగంగా కలెక్టర్ బంగ్లాలో ఆదివారం రాత్రి 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ రక్షణలో ఉంటూ సరిహద్దుల్లో వీర మరణం పొందిన సైనికుల కుటుంబసభ్యులకు విందు ఏర్పాటు చేశారు. ఉరవకొండకు చెందిన గిన్నె గిరిప్రసాద్ 2008న దేశ సరిహద్దుల్లో చేపట్టిన ఆపరేషన్ పాల్కన్‌లో ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు. ఆయన తల్లి వీరమ్మ, తమ్ముడు గిన్నె సురేంద్రతో కలెక్టర్ మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అలాగే పామిడి మండలం వంకరాజుకాలువకు చెందిన బి.అమర్‌నాథ్ 2018లో దేశసరిహద్దులో చేపట్టిన ఆపరేషన్ రైనోలో అమరుడయ్యారు. ఆయన తల్లి తలారి లక్ష్మీదేవి, కుటుంబసభ్యుడు నరసింహులు హాజరయ్యారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన తమ కొడుకుల స్థానంలో తనను కొడుకుగా భావించి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారం చూపుతానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి తిమ్మప్ప పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు మరింత శ్రమిద్దాం

- గణతంత్ర వేడుకల్లో డీఆర్ఎం సీఎస్ గుప్తా




జాతీయ పతాకానికి గౌరవవందనం చేస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు: డివిజన్‌కు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని డీఆర్ఎం సి.చంద్రశేఖర్ గుప్తా పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే క్రీడామైదానంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని డీఆర్ఎం సీఎస్ గుప్తా ఆవిష్కరించారు. అనంతరం ఆర్‌పీఎఫ్‌ల నుంచి గౌరవ వందన స్వీకరించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనజర్ అరుణ్ కుమార్ జైన్ పంపిణీ సందేశాన్ని చదివి వినిపించారు. డివిజన్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా రైల్వే పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ క్యాప్రిల్ ఆరోరా, సీనియర్ డీసీఎం మనోజ్, ఆర్‌పీఎఫ్ కమిషనర్ టి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో...: స్థానిక జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎస్పీ రాహుల్ మీనా ఆవిష్కరించి సిబ్బంది నుంచి గౌరవ వందన స్వీకరించారు. ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన దాదాపు 70మందిపైగా రైల్వే పోలీసులకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేశారు.

50 వసంతాల ఆత్మీయ వేడుక



ఆత్మీయ వేడుకకు హాజరైన పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కరణం చిక్కప్ప పాఠశాలలో 1975లో 10వ తరగతి చదువుకున్న వారు ఐదు దశాబ్దాల తర్వాత ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ఆత్మీయ వేడుక నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. నాటి గురువులు నాగభూషణం, శ్రీరాములును సన్మానించారు.కార్యక్రమంలో ఎల్‌ఐసీ మురళి, నూరుల్లా, సుబ్రహ్మణ్యం, రమేష్, నాగవేణి, సత్యవతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



జిల్లా అధ్యక్షుడు అనంతను సన్మానిస్తున్న చేనేత విభాగం నగరాధ్యక్షుడు దేవాంగం రామయ్య

అనంతపురం కార్పొరేషన్: పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు అనంతను చేనేత విభాగం నగరాధ్యక్షుడు దేవాంగం రామయ్య మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు సాకే చంద్ర, శ్రీదేవి, సైపుల్లాబేగ్, కార్పొరేటర్ కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

మాఘమాస ఉత్సవాలకు ఏర్పాట్లు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ ఈఓ బాబు, తదితరులు

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఒకటి. స్వామిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తారని ఆలయ ఈఓ బాబు, అర్చకుడు రాము తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఆలయంలో మాఘమాస ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదివారం మాఘమాస ఉత్సవాలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఫిబ్రవరి 3వ తేదీన మాఘమాస షష్ఠి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం, 9వ తేదీన మహా గణపతి హోమం, 12న మాఘ పౌర్ణమి, విశేష అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 16న సూర్యనమస్కారాలు, అరుణ హోమం, మహా సౌరము, 26న మహాశివరాత్రి ఉత్సవాలు, మంజునాథుడికి కల్యాణం జరిపిస్తామని తెలిపారు. భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



మొబైల్ కోర్టు జిల్లా న్యాయమూర్తి సృజన్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని జిల్లా మొబైల్ కోర్టు న్యాయమూర్తి సృజన్ కుమార్ ఆదివారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా మొబైల్ కోర్టు న్యాయమూర్తిని ఆలయ ఈఓ బాబు శాలువాతో సన్మానించారు. అంతకు ముందు మంజునాథ స్వామి, పార్వతీ దేవికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళహారతి ఇచ్చారు.

కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన



బైక్ ర్యాలీ చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని రైతు, కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఆదివారం స్థానిక టవర్ క్లాక్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుళు, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చెన్నప్పయాదవ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, తదితరులు మాట్లాడారు. ఏడాదిపాటు సాగిన రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం యావత్ రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీ పెత్తనం కింద తెచ్చేవే అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానమే లేదన్నారు. రైతులను దగా చేస్తున్న కేంద్రంలోని ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్



కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న జేసీ శివ నారాయణ శర్మ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, మేయర్ వసీం



రాప్తాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ర్యాలీ

మురిసిన త్రివర్ణం

- ఘనంగా రిపబ్లిక్ డే

అనంతపురం సిటీ: భారత రాజ్యాంగం అమలుతో మనకు స్వేచ్ఛ స్వాతంత్య్రాలు లభించాయి. ప్రాణత్యాగం చేసిన అమరులు కొందరైతే.. మరి కొందరు వారి జీవితాలను అంకితం చేశారని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శాంతికి చిహ్నంగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కపోతాలను ఎగురవేశారు. జెడ్పీ ఉద్యోగులందరూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాలని సూచించారు.

జెడ్పీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

జెడ్పీ తరఫున ఇక నుంచి ఏటా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రకటించారు. అందులో భాగంగా ఈసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 మంది ఉద్యోగులకు జెడ్పీ తరఫున ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓలు షబ్బీర్ నియాజ్, విజయ భాస్కర్‌రెడ్డి, రత్నాబాయి, కమ్మ నాగరాజు, శ్రీవాణి, మహబూబ్‌బాషా, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీరాజ్ జిల్లా కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయం, తపాలా శాఖ, బీఎస్ఎన్ఎల్, రైల్వే స్టేషన్, , జీఆర్‌పీ పోలీస్ స్టేషన్, ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ల వద్ద జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్‌ఈ మహమ్మద్ జహీర్ అస్లాం, లక్ష్మీనారాయణ, అరుణ్‌బాబు, భానుకుమార్, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా షేక్, రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ సీఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ కార్యాలయంలో..

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జ్ హోదాలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ హాజరై మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో సీఈఓ కే.సురేఖారాణి, నాబార్డు డీడీఎం అనురాధ, డీజీఎంలు రామ్‌ప్రసాద్, విజయచంద్రా రెడ్డి, సుఖదేవ బాబు తదితరులు పాల్గొన్నారు. తొలిసారిగా డీసీసీబీ తరఫున స్థానిక పేరేడ్ మైదానంలో జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాల్లో శకటం ప్రదర్శించారు. కలెక్టర్ చేతుల మీదుగా సీఈఓ కె.సురేఖారాణి అవార్డు అందుకున్నారు. ఇక వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, పట్టుశాఖ అధికారి డి.ఆంజనేయులు, మార్కెటింగ్ ఏడీ పి.సత్యనారాయణ చౌదరి తదితరులు తమ శాఖల కార్యాలయ ఆవరణలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

జేఎన్‌టీయూ, ఎస్కేయూలో..

అనంతపురం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు ధరణి కిశోర్, క్రాంతి కుమార్, ఆర్ఐ రెడ్డప్ప, ఎస్ఐ వెంకట కృష్ణ, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అడిషనల్ ఎస్పీ డీవీ రమణ మూర్తి జెండాను ఆవిష్కరించారు. జేఎన్‌టీయూ, ఎస్కేయూలో జరిగిన కార్యక్రమాల్లో జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో..

రాప్తాడు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో ముందుగా జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సీఐ శ్రీహర్ష, ఎంఈఓ మల్లికార్జున, రాప్తాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాంబశివుడు, ఎల్లార్టీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బొంతూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ హేమలత, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ నీలిమ, జాతీయ జెండా ఎగురవేశారు. మేజర్ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి జెండాను ఎగరవేసి జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అదే విధంగా పాఠశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వివిధ స్కూళ్లలో..

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లు, కళాశాలల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు పోరాట యోధుల త్యాగ ఫలితాన్ని గుర్తుంచుకుని.. మన దేశాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేలా ఎదగాలని వక్తలు పిలుపునిచ్చారు.

జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో..

అనంతపురం కల్చరల్: జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక లలిత కళాపరిషత్తులో జరిగిన సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. జిల్లాకు చెందిన పలువురు డ్యాన్స్ మాస్టర్లు తమ శిష్యబృందాలతో కలిసి ఆటపాటలతో హోరెత్తించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. బాల్యం నుంచే విద్యార్థుల్లో దేశభక్తి నింపాలని సూచించారు. చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. ఎల్కేపీ కార్యదర్శి పద్మజ నేతృత్వంలో పలువురు కళాకారులు కలెక్టర్‌ను సత్కరించారు. నెహ్రూ యువకేంద్రంలో జరిగిన రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో సమాజ సేవ చేస్తున్న 45 మంది యువతీ యువకులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు భరత్, జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లహరి, డాక్టర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని జాతీయ పతాకంతో అలంకరించారు. కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు నేతృత్వంలో జరిగిన వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో..

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతపురం జిల్లా సర్కిల్ పరిధిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న 50 మంది ఉద్యోగులకు విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందజేశారు.



అనంతపురం సిటీ: కపోతాలు ఎగురవేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు



ఆత్మకూరు: జెండా ఎగరవేస్తున్న ఎంపీపీ హేమలత, అధికారులు



జాతీయ నాయకుల వేషధారణలో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు



నెహ్రూ యువకేంద్రంలో సర్టిఫికెట్ల ప్రదానం



రాప్తాడు: వైద్యాధికారి శివకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వైద్య సిబ్బంది



ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జెండా ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ మాణిక్యరావు

కార్మికులకు దుస్తుల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మికులకు కార్మికులకు దుస్తులు, పుష్కాట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ మల్లికార్జున రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, బాలాంజినేయులు, అబూసలేహ, సైపుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

అనంతపురం అర్బన్: మహనీయులను ఆదర్శంగా తీసుకుని వారు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, పరిపాలనాధికారి అలెగ్జాండర్, విభాగాల అధిపతులు వసంత లత, యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, వాణిశ్రీ, ఖజానా శాఖ డీడీ సరళ విజయకుమారి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పలువురికి ‘ఉత్తమ’ అవార్డులు



కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న అగ్రికల్చర్ జూనియర్ అసిస్టెంట్ రాకేష్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సామాజిక సేవా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ ప్రశంసాపత్రాలు అందజేశారు. భవిష్యత్తులోనూ ప్రజలకు విశిష్ట సేవలందించాలని ఉద్యోగులకు సూచించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



హేమలత, టైపిస్ట్, ఆర్డీఓ ఆఫీసు



అరుణ్ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్



వెంకటేశ్, టైపిస్ట్, బీసీ కార్పొరేషన్



వరప్రసాద్ రాజు, స్టోర్ మేనేజర్



జాకీర్ హుస్సేన్, హోంగార్డు



రవి, వాచ్‌మెన్, హౌసింగ్



భవాని, సీనియర్ అసిస్టెంట్



శ్రీగౌరి, జూనియర్ స్టెనో



ఎంఏ ఖయూమ్, సూపరింటెండెంట్



మహబూబ్‌బాషా, టాప్ ఇన్‌స్పెక్టర్



పార్వతి ప్రిన్సిపాల్, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్



బి.శంకర్, ట్రైబల్ వెల్ఫేర్



రాజ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్



శ్రీనివాసులు, సూపరింటెండెంట్



వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్



డాక్టర్ పతికి రమేష్ నారాయణ



ప్రమీలమ్మ సామాజిక కార్యకర్త



జనార్ధన సామాజిక కార్యకర్త



లెనిన్ బాబు, సామాజిక కార్యకర్త



లక్ష్మీనారాయణ, ఎస్ఐ, ఆత్మకూరు



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్ఈ సంపత్ కుమార్

కార్యకర్తల త్యాగం వృథా కానివ్వం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- కష్టపడే ప్రతి కార్యకర్తకూ పార్టీలో గుర్తింపు ఉంటుంది
- 2029లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ‘గతంలో వలంటీర్ల వ్యవస్థ కారణంగా కార్యకర్తలను నిర్లక్ష్యం చేశాం. ఇకపై ఆపరిస్థితి ఉండదు. జగనన్న మాటగా చెబుతున్నా.. పార్టీకి పట్టుకొమ్మల్లాంటి కార్యకర్తల త్యాగాలను వృథా కానివ్వం. కార్యకర్తల ద్వారానే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తాం’ అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం అనంతపురం నగర శివారులోని తన క్యాంపు కార్యాలయంలో రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. దౌర్జన్యాలకు పాల్పడే టీడీపీ నాయకులు, కార్యకర్తల్లా ఖబడ్దార్.. ఎల్లకాలమూ మీరే అధికారంలో ఉంటారని కలలు కనొద్దని హెచ్చరించారు. అబద్ధాలు, మోసాలు అనే పునాదులపై అధికారంలోకి వచ్చారన్నారు. మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు గ్రామాల్లో వర్గాలు, కక్షలకు ఆజ్యం పోస్తే మాత్రం చూస్తూ ఊరుకోమన్నారు. రానున్న రోజుల్లో రిటర్న్‌గిఫ్ట్ ఇస్తామని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు సక్సెస్ అయ్యారన్నారు. 2014లో ఏ విధంగా అయితే అలివిగాని హామీలు ఇచ్చారో.. 2024లోనూ అంతకు మించి హామీలు ఇచ్చి ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ లేదు.. సంక్షేమ పథకాలూ లేవన్నారు. అభివృద్ధి పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో పరిటాల కుటుంబం చేస్తున్న దోపిడీలు, దౌర్జన్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు వల్ల మోసపోతున్నామని అన్ని వర్గాల ప్రజలు గుర్తించారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాలనే కసి పెరుగుతోందన్నారు. 2029లో మళ్లీ మనమే అధికారంలోకి రాబోతున్నామన్నారు. సమావేశంలో రామగిరి జెడ్పీటీసీ నాగార్జున, పార్టీ శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు సానే రాజశేఖర్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఓబుగారి హరినాథరెడ్డి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల పార్టీ కన్వీనర్లు డోలా రామచంద్రారెడ్డి, మీనుగ నాగరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులను కళల్లోనూ ప్రోత్సహించాలి



హీరో సంపూర్ణేష్ బాబును సత్కరిస్తున్న రాగే పరుశురాం

అనంతపురం కల్చరల్: కేవలం చదువులు, మార్కులు మాత్రమే కాకుండా మనిషి జీవితానికి ప్రశాంతత చేకూర్చే కళల్లోనూ చిన్నారులను ప్రోత్సహించాలని హీరో సంపూర్ణేష్ బాబు సూచించారు. రెండు రోజుల పాటూ సందడిగా సాగిన లహరి డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీ రజతోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. డ్యాన్స్ మాస్టర్ హరిప్రసాద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి హీరో సంపూర్ణేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వయం కృషికి మారుపేరుగా హరిప్రసాద్ ఎదుగుతున్న తీరు అభినందనీయమన్నారు. మాజీ మేయర్ రాగే పరుశురాం, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, సీనియర్ న్యాయవాది జనార్ధనా చారి తదితరులు మాట్లాడారు. మహిళలకు ఏరోబిక్స్ ద్వారా అందిస్తున్న శిక్షణ అద్భుతమని కొనియాడారు. అనంతరం వేర్వేరు ప్రాంతాల నుంచి అనంతకు వచ్చిన 25 మంది వెస్ట్రన్ డ్యాన్స్ మాస్టర్లు, సామాజిక సేవా కార్యకర్త సుంకర రమేష్‌ను సత్కరించారు. సంపూర్ణేష్ బాబును జిల్లా కళాకారులు ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్, నటుడు రమేష్ నీల్, నిర్మాత రాజు తదితరులు పాల్గొన్నారు.

బొలెరో బోల్తా

కనగానపల్లి: మండల పరిధిలోని ముక్తాపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం బొలెరో బోల్తా పడింది. మామిళ్లపల్లి నుంచి అనంతపురం వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి డివైడర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలెరో రహదారిపై పడిపోవడంతో అందులో ఉన్న బియ్యం ప్యాకెట్లతో పాటు టమాట ట్రేలు కిందపడ్డాయి. అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయట పడ్డారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విస్మరించి పాలన సాగిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కార్మికుల సంక్షేమం, శ్రమను కార్పొరేట్లకు తాకట్టు పెడుతోందన్నారు. ఇందుకు బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణుడు, చిరంజీవి, శ్రీనివాసులు, రాజు, దుర్గాప్రసాద్, కృష్ణానాయక్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాంతి సద్భావన రథయాత్ర



రథయాత్రలో పూజలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ బంజారాల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ ముందస్తు ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలో ఆదివారం సాయంత్రం భారీ ర్యాలీ జరిగింది. స్థానిక రెండో రోడ్డులోని బంజారా భవన్ నుంచి ఐక్యతను చాటుతూ టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, ఆదర్శనగర్‌లోని మారెమ్మ దేవాలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. బంజారాల ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే భోగ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు సంత్ సేవాలాల్ మహారాజ్ వారి సేవాఘడ్ టూ ఫోహరా ఘడ్ పేరిట రచించిన ఆంగ్ల జీవిత చరిత్ర పుస్తకాలను బంజారా భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర నాయకులు జగన్నాథరావు, రవీంద్రనాయక్, అశ్వర్థ నాయకులు, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలాజీ నాయక్, బాబూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.